ఓ రోజు డాక్టర్ ఆ నాస్తిక కేన్సర్ రోగిని పరీక్షించాడు. ఎగ్జామినేషన్ రూమ్‌లోంచి బయటకి వెళ్ళేప్పుడు ఆ రోగి డాక్టర్‌తో చెప్పాడు.

"డాక్టర్! కేన్సర్ రోగానికి చికిత్స లేదుగా. నాకు చావంటే చాలా భయంగా వుంది."

"ఎందుకు భయం?" ప్రశ్నించాడు డాక్టర్.

"అవతలివైపు ఏముందో తెలీదు కాబట్టి. మీరు గొప్ప దైవభక్తులు కదా? అది మీరు చెప్పగలరా?"

"నాకూ తెలీదు." చెప్పాడు డాక్టర్.

"తెలీదా? మీకూ తెలీదా?" వెటకారంగా అన్నాడు ఆ నాస్తిక రోగి.

ఇంతలో బయటకున్న తలుపుని అవతలనించి ఎవరో గీకుతున్న శబ్దం వినిపించసాగింది. డాక్టర్ ఆ తలుపు తెరిచాడు.

వెంటనే అవతలి నించి డాక్టర్ పెంపుడు కుక్క లోపలికి వచ్చింది. అది డాక్టర్ కాలు నాకుతూ, తోకాడిస్తూ తన ఆనందాన్ని ప్రకటించసాగింది.

ఆ రోగివైపు తిరిగి నవ్వుతూ చెప్పాడు డాక్టర్.

"చూసారా? ఇంతదాకా ఈ కుక్క ఈ గదిలోకి ఎన్నడూ రాలేదు. దాని యజమాని అయిన నేను ఉన్నానన్న ఒక్క విషయం తప్ప, లోపల ఏముందో దానికి తెలీదు. తలుపు తెరచుకోగానే ఎలాంటి భయం లేకుండా లోపలకి వచ్చింది. అలాగే మరణానికి అవతలివైపు ఏముందో నాకు తెలీదు. కానీ దేవుడున్నాడని మాత్రం తెలుసు. కాబట్టి భయం లేకుండా అక్కడికి వెళ్ళగలను. భక్తుడికి, నాస్తికుడికీ గల తేడా ఇదే."

## 14. భూమి మీది దైవం

అనగనగా ఓ రోజు ఒక పసిపాప పుట్టడానికి సిద్ధంగా వుంది. ఆ పాప దేవుడి దగ్గరకి వెళ్ళి దుఃఖిస్తూ దీనంగా అడిగింది.

"ఇంకా సేపట్లో నేను భూమి మీదకి వెళ్తున్నాను కదా! ఇక్కడ స్వర్గంలో నేను హాయిగా వున్నాను. నన్ను నవ్విస్తూ, నాకు పాటలు వినిపిస్తూ ఎందరో దేవతలున్నారు. మరి భూమి మీద ఎలా?"

"మరేం ఫర్వాలేదు. భూమి మీద ఉన్న అనేకమంది దేవతలలోంచి ఒకరిని నీకోసం నేను స్వయంగా ఎన్నుకున్నాను. ఆ దేవత నీకు అన్ని విషయాల్లో, అన్ని విధాలా సహాయం చేస్తుంది." చెప్పాడు దేవుడు.

"మనుషులు నాతో మాట్లాడితే, నాకు ఆ మాటలు ఎలా అర్థమౌతాయి? నాకు మానవుల భాష రాదుగా?"

"ఆ దేవత ఎంతో ఓపికగా నీకు మధురమైన మాటలు చెప్తూ, మానవ భాష ఎలా మాట్లాడాలో నేర్పిస్తుంది."

"భూమి మీద చెడ్డ మనుషులు అధికంగా ఉన్నారని విన్నాను. వాళ్ళ నించి నాకు ప్రమాదం ఉండదా?"

"భయం లేదు. నీ కోసం నియమించిన దేవత తన ప్రాణాలనైనా అడ్డు పెట్టి నిన్ను వాళ్ళ నుండి కాపాడుతుంది."

"మరి నాకు ఆకలి వేస్తే?"

"నీ దేవత నిన్ను ఎన్నటికీ ఆకలితో ఉంచదు. అవసరమైతే తనే పస్తుండి అయినా నీకు భోజనం పెడుతుంది."

"మరి నీతో మాట్లాడాలనిపిస్తే ఎలా?"

"ఆ దేవత నీ చేతులని కలిపి ఎలా ప్రార్థించాలో నేర్పిస్తుంది. నీ ప్రార్థనలన్నీ నేను తప్పక వింటాను."

"కానీ..నిన్ను విడిచి వెళ్ళడం నాకిష్టం లేదు స్వామీ. మళ్ళీ నిన్ను నేను ఎప్పటికైనా చూస్తానో లేదో!" ఏడుస్తూ చెప్పిందా పాప.

"నువ్వు తిరిగి నా దగ్గరికెలా రావాలో ఆ దేవతే నీకు నేర్పుతుంది."

భూలోకంలోకి వెళ్ళే సమయం వచ్చింది. అప్పుడు అడిగిందా పాప.

"దైవమా! భూలోకంలో కోట్లమంది జనం ఉన్నారు కదా. మరి నేనా దేవతని ఎలా తెలుసుకుంటాను? కనీసం ఆ దేవత పేరేమిటో చెప్పు."

"ఆమె పేరేదైనా నువ్వు మాత్రం జీవితాంతం ఆమెని 'అమ్మ' అని పిలు చాలు." చెప్పాడు దేవుడు.

## 15. మనలోని దేవుడు

ఈశ్వర సర్వ భూతానాం, సర్వం ఖల్విదం బ్రహ్మ లాంటి ప్రవచనాలు ఓ ఆధ్యాత్మిక ప్రవచనంలో విన్నాక ఒకతను ఇలా అడిగాడు.

"స్వామీ! మీరు ప్రతీ మనిషిలో దేవుడున్నాడని చెప్పారు కదా? మరి కొందరు మనుషులు ఎందుకు దయాహీనంగా, దుర్మార్గంగా ప్రవర్తిస్తారు?"

"వాళ్ళు తమలోని దేవుడ్ని తొక్కిపెట్టి ఉంచుతారు కనుక." చెప్పాడు స్వామి.

ఆ సమాధానంతో అతనికి తృప్తి కలగలేదు. ఆ విషయమే ఆలోచిస్తూ ఇంటికి నడవసాగాడు.

ఓ ముసలి దంపతులు రోడ్డు క్రాస్ చేస్తూండగా, ఓ కారు హారన్ మోగించుకుంటూ, వేగం తగ్గకుండా రావడం ఇంట్లోకి వెళ్తున్న అతను గమనించాడు. ముసలి దంపతులు ఏంచెయ్యాలో తోచక రోడ్డు మీద బిత్తరపోయి చూస్తూ నిల్చుండిపోయారు. అతను పరిగెత్తుకు వెళ్ళి వాళ్ళ చేతులు పట్టుకుని పక్కకి లాగాడు.

"ఇడియట్. కళ్ళు కనబడటం లేదా?" కోపంగా అరిచాడు ఆ కారు డ్రైవర్ మీద.

కారు రివర్స్‌లో వెనక్కి వచ్చి ఆగింది. డ్రైవర్ కోపంగా దిగి అతన్ని ఓ పిడిగుద్దు గుద్దాడు. అతని పెదవి చిట్లి రక్తం రుచి నాలుకకి తెలిసింది.

"ఖబడ్దార్." హెచ్చరించాడా డ్రైవర్.